ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జోగులాంబ గద్వాల జిల్లా వార్తలు
శుక్రవారం 4 జూలై 2025
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 33.0 కనిష్ఠం : 24.0





గద్వాల పట్టణంలోని యూనియన్ బ్యాంకులో ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

హక్కుల పరిరక్షణకు కృషి

- బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ సీతాదయాకర్‌రెడ్డి
- సభ్యులతో కలిసి వనపర్తి, శ్రీరంగాపూర్‌లో పర్యటన
- అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ, అధికారులతో సమీక్ష



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీతా దయాకర్‌రెడ్డి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : బాలల హక్కులను పరిరక్షించేందుకు అధికారులు నిబద్ధతతో కృషి చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కొత్తకోట సీతా దయాకర్‌రెడ్డి సూచించారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు కంచర్ల వందన గౌడ్, మరిపల్లి చందన, అపర్ణ, గోగుల సరిత, ప్రేమలత అగర్వాల్, వచన్ కుమార్‌లు గురువారం వనపర్తి జిల్లాలో పర్యటించారు. శ్రీరంగాపూర్ గ్రామంలోని అంగన్ వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. వనపర్తి పట్టణంలో బాల సంరక్షణ కేంద్రం, బాలికల ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ రావుల గిరిధర్‌లతో కలిసి లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీతా దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ చిన్నారులకు పౌష్టికాహారం అందించి, వారికి అనారోగ్య సమస్యలు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత స్త్రీ, శిశు సంక్షేమం, వైద్య ఆరోగ్య శాఖలపై ఉందన్నారు. చిన్నారుల కోసం అంగన్‌వాడీల్లో ఇచ్చే బాలామృతంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో నమోదైన పోక్సో, బాల్య వివాహాలు, బాల కార్మికుల కేసుల వివరాలను సంబంధిత శాఖల అధిఆరులను అడిగి తెలుసుకున్నారు. కనీస మౌలిక వసతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. ప్రైవేటు పాఠశాలను తనిఖీ చేసి, తీసుకున్న చర్యలపై నివేదిక పంపించాలని సూచించారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ జిల్లాలో వయసుకు తగిన బరువు, ఎత్తు లేని పిల్లలను ఎన్‌ఆర్‌సీ కేంద్రానికి పంపిస్తున్నట్లు తెలిపారు. వారం రోజుల పాటు అవసరమైన వైద్యం, పౌష్టికాహారం అందించి వారిని ఆరోగ్యవంతులను చేస్తున్నట్లు తెలిపారు. అనాథ పిల్లలకు మెరుగైన విద్యను అందించడంతో పాటు, వారికి ఆరోగ్యశ్రీ కార్డులు జారీ చేసేందుకు ప్రతిపాదనలను పంపించినట్లు చెప్పారు. ఎస్పీ రావుల గిరిధర్ మాట్లాడుతూ జిల్లాలో బాల్య వివాహాలు జరిగితే కచ్చితంగా కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. పోక్సో కేసులో చార్జిషీట్ నమోదు చేయడమే కాకుండా, బాధితులకు సకాలంలో పరిహారం ఇప్పించడం, సపోర్టు పర్సన్‌ను నియమించి వారికి తగిన ధైర్యం, సహాయ సహకారాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ యాదయ్య, జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి, డీసీపీవో రాంబాబు, వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.



సోమశిల వద్ద కృష్ణానది సోయగాలు

ప్రకృతి ఒడిలో పెళ్లి పందిరి

- డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు వేదిక కానున్న సోమశిల
- పర్యాటక శాఖ గుర్తించిన 4 ప్రాంతాల్లో ఇది ఒకటి
- కృష్ణానది తీరాన పెళ్లిళ్లు, శుభకార్యాలకు అవకాశం
- ఆధునిక, విలాసవంతమైన భవనాల నిర్మాణం
- ఫొటో సెషన్లకు లొకేషన్లు, సెల్ఫీ పాయింట్ల ఏర్పాటు
- కొత్త అందాలను సంతరించుకోనున్న పర్యాటక కేంద్రం

పచ్చని ప్రకృతి నడుమ, గలగల పారే కృష్ణానదీ తీరాన మంగళ వాయిద్యాలు మోగనున్నాయి. కొత్త జంటలు ఏడడుగులు నడిచి వివాహ బంధంతో ఏకం కానున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని ప్రఖ్యాత పర్యాటక కేంద్రం సోమశిల పెళ్లిళ్లు, శుభకార్యాలకు వేదిక కానున్నది. అందుకోసం డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు పర్యాటక శాఖ రాష్ట్రంలో నాలుగు పర్యాటక కేంద్రాలను గుర్తించింది. అందులో సోమశిల క్షేత్రాన్ని కూడా చేర్చింది.

- కొల్లాపూర్ (ఆంధ్రజ్యోతి)



సోమశిల గ్రామంలోని లలితాంబిక సోమేశ్వర ఆలయం

6

చేనేత కార్మికులకు చేయూత

- లక్ష రూపాయల రుణమాఫీ అమలు చేసేందుకు చర్యలు
- జోగులాంబ గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో 2,100 మంది కార్మికులు, రూ. 6 కోట్ల రుణాలు
- అర్హుల గుర్తింపునకు అధికారుల కసరత్తు

అయిజ, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : చేనేత కార్మికులకు ఆర్థికంగా చేయూత అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. అప్పుల పాలైన చేనేత కార్మికులను ఆదుకోవడమే లక్ష్యంగా రుణమాఫీ అమలు చేయనున్నది. అందుకోసం రూ. 33 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు చేనేత, జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రుణమాఫీ అమలుకు మార్గదర్శకాలను కూడా విడుదల చేశారు. దీంతో రుణమాఫీకి అర్హులైన చేనేత కార్మికులను గుర్తించేందుకు గత 10 రోజులుగా అధికారులు కసరత్తు చేస్తున్నారు. 2017 సంవత్సరం ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు రుణాలు పొందిన వారి జాబితాను సేకరించారు. చేనేత, జౌళిశాఖ జిల్లా అధికారులు జిల్లాలోని వివిధ బ్యాంకులకు వెళ్లి కార్మికుల రుణ పత్రాలను (డాక్యుమెంట్లు) పరిశీలిస్తున్నారు. జోగుళాంబ గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో ఈ ప్రక్రియ కొనసాగుతోంది.

4 రోజుల్లో పరిశీలన పూర్తి

చేనేత కార్మికులకు లక్ష రూపాయల రుణాన్ని మాఫీ చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. జోగుళాంబ గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో 2,100 మంది కార్మికులు రూ.6 కోట్ల వరకు వివిధ బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నట్లు అధికారులు చెప్తున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు సంబంధిత అధికారులు బ్యాంకులకు వెళ్లి కార్మికులు తీసుకున్న రుణాలను పరిశీలిస్తున్నారు. చేనేత కార్మికులు తీసుకున్న రుణం, ప్రస్తుత పరిస్థితిని విచారిస్తున్నారు. అప్పు తీసుకునేందుకు కార్మికులు సమర్పించిన ధ్రువ పత్రాలను పరిశీలిస్తున్నారు. మరో నాలుగు రోజుల్లో పరిశీలన పూర్తికానున్నది.

రాష్ట్ర స్థాయి కమిటీకి అర్హుల జాబితా

పరిశీలన పూర్తయిన అనంతరం రుణమాఫీకి అర్హులైన చేనేత కార్మికుల జాబితాను రూపొందిస్తారు. అనంతరం దీనిపై జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో చర్చించనున్నారు. కలెక్టర్ అధ్వర్యంలో నిర్వహించే ఈ సమావేశంలో అర్హుల జాబితాను ఆమోదించి రాష్ట్ర స్థాయి కమిటీకి పంపించనున్నారు. అక్కడ ఆమోదం పొందిన అనంతరం అర్హులకు రుణమాఫీని వర్తింపచేస్తారు.

అర్హులకు న్యాయం జరుగుతుంది

గోవిందయ్య, చేనేత, జౌళి శాఖ జిల్లా అధికారి : ప్రభుత్వం కల్పించిన రుణమాఫీ అర్హులైన ప్రతి ఒక్కరికి వర్తించే విధంగా విచారణ చేస్తున్నాము. గుర్తింపు పారదర్శకంగా జరుగుతోంది. ఎక్కడ కూడా పక్షపాత ధోరణి చూపటంలేదు. మూడు జిల్లాలో గత 10 రోజులుగా ఈ విచారణ సాగుతోంది. అర్హులను గుర్తిస్తున్నాము. 4 రోజులలో ఈ ప్రక్రియ పూర్తవుతుంది.


ఫోన్ పోతే వెంటనే ఫిర్యాదు చేయాలి

- గద్వాల ఎస్పీ శ్రీనివాసరావు




బాధితుడికి సెల్‌ఫోన్ అందిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల క్రైం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా తమ సెల్‌ఫోన్ పోగొట్టుకున్నా, చోరీకి గురైనా వెంటనే ఫిర్యాదు చేయాలని గద్వాల ఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో పోగొట్టుకున్న, చోరీకి గురైన 52 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి, గురువారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో వాటి యజమానులకు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఫోన్లు పోగొట్టుకున్న వారు వెంటనే ప్రతీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ప్రత్యేక విభాగంలో సంప్రదించాలని సూచించారు. జిల్లా పరిధిలో ఈ ఏడాది ఇప్పటివరకు 853 మంది సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వాటిలో 413 ఫోన్లను గుర్తించామన్నారు. అందులో 260 ఫోన్లను యజమానులకు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ మొగిలయ్య, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



కొండాకోనల్లో.. మయూర విహారం



కమ్ముకున్న మబ్బులు, చిరు జల్లులతో ఆహ్లాదకర వాతావరణం ఏర్పడింది. పచ్చదనం సంతరించుకున్న ప్రకృతి అందాలకు పరవశించిన మయూరాలు కొండా కోనల్లో, పంట పొలాల్లో ఆనంద విహారం చేస్తున్నాయి. వనపర్తి మండలం అచ్యుతాపురం శివారు ప్రాంతంలో నెమళ్లు సందడి చేస్తున్నాయి. ఈ దృశ్యాలను గురువారం 'ఆంధ్రజ్యోతి' కెమెరాలో బంధించింది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వనపర్తి (ఆంధ్రజ్యోతి)

క్లిక్.. క్లిక్..



రుణాల మంజూరులో బ్యాంకర్ల పాత్ర కీలకం

- రైతులకు విరివిగా రుణాలివ్వాలి
- నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అభివృద్ధిలో బ్యాంకులు భాగస్వాములు కావాలని, రుణాల మంజూరులో వాటి పాత్ర కీలకమని నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం డీసీసీ, డీఎల్‌ఆర్‌సీ (బ్యాంకర్ల) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో రుణాలు అందించి వారి ఆర్థిక అభ్యున్నతికి తోడ్పాటు అందించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాల ద్వారా అందిస్తున్న రుణాలు అర్హులైన లబ్ధిదారులకు అందేలా కృషి చేయాలన్నారు. నాగర్‌కర్నూల్ వరి సాగు ఆధారిత జిల్లా అని, అందుకు అనుగుణంగా రైతులకు విరివిగా రుణాలను మంజూరు చేయాలని సూచించారు. ఇందిరా మహిళ శక్తి రుణాలు, మహిళా స్వయం సహాయక సంఘాల బ్యాంకు లింకేజీలు, దీంతో పాటు విద్యార్థుల ఉన్నత చదువులకు రుణాలను అత్యధిక సంఖ్యలో మంజూరు చేయాలన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం, పీఎం సూర్యఘర్, స్టాండ్ అప్ ఇండియా, పీఎం ఈజీపీ, ముద్ర లోన్స్ తదితర పథకాలకు రుణాల మంజూరు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆదివాసీలు, గిరిజనులు, వెనుకబడిన వర్గాల శ్రేయస్సుకు రుణాలను అందించి తోడ్పాటుకు కృషి చేయాలన్నారు. జూలై 15న నిర్వహించే దిశ సమావేశానికి రుణాలకు సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరు కావాలని బ్యాంకర్లను ఆదేశించారు. సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ దేవ సహాయం, నాబార్డు డీడీఎం మనోహర్‌రెడ్డి, ఆర్‌బీఐ ఎల్‌డీవో రాములు, లీడ్ బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖర్, డీఆర్‌డీవో పీడీ చిన్న ఓబులేష్, జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి రాజేశ్వరి, డీఈవో రమేశ్‌కుమార్, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ రామ్‌లాల్, జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఖాజానాజీమ్ అలీ అప్సర్, జిల్లా మత్స్యశాఖ అధికారి రజిని, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

'ఉపాధి' పనులపై బహిరంగ విచారణ

- ఏడు గ్రామాల్లో రూ.86,952 అవినీతి
- జోగులాంబ గద్వాల అదనపు కలెక్టర్ నర్సింగరావు
- పూర్తి వివరాలు శుక్రవారం వెల్లడిస్తాం : ఏపీవో విజయలలిత

6

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- గద్వాల పట్టణ ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్

6

అనంతగిరి అడవుల్లో యువకుడి ఆత్మహత్య

6

కొనసాగుతున్న డిగ్రీ, పీజీ విద్యాసంస్థల బంద్



గద్వాల పీజీ కేంద్రం ముందు నిరసన తెలుపుతున్న నాయకులు

గద్వాల సర్కిల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లాలో డిగ్రీ, పీజీ కళాశాలల బంద్ కొనసాగుతోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల చెల్లింపు తదితర సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ 72 గంటల బంద్‌కు పిలుపునిచ్చింది. అందులో భాగంగా గురువారం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ప్రొఫెషనల్ (డిగ్రీ, పీజీ) విద్యా సంస్థలు తెరుచుకోలేదు. అడ్మిషన్లు, తరగతుల నిర్వహణకు కొన్ని విద్యాసంస్థలను తెరవగా, పీడీఎస్‌యూ నాయకులు వెళ్లి తరగతులను బహిష్కరించి మూసివేయించారు. కార్యక్రమంలో యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి రంగస్వామి, టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి సుభాన్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌నాయక్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- యూత్ కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు చిక్కుడు వంశీకృష్ణ

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని డీసీసీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పిలుపునిచ్చారు. త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని సూచించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాలులో గురువారం జిల్లా యూత్ కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి వినోద్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణతో పాటు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి హాజరై కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకంపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు రుణ మాఫీ, రైతు భరోసా, పేదల ఇంటికి ఉచిత కరెంటు, సన్నబియ్యం పంపిణీ తదితర సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి యువత కాంగ్రెస్ పార్టీ వైపు ఆకర్షితులు అవుతున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ గంగాపురం రాజేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, పెద్దకొత్తపల్లి మాజీ ఎంపీపీ ప్రతాప్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షుడు కొడిదెల రాము, నాయకులు కోటయ్య, తిరుపతిగౌడ్, మాజీ కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, వేదికపై నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి

అనంతగిరి అడవుల్లో యువకుడి ఆత్మహత్య



రమేష్ (ఫైల్)

వనపర్తి, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : వికారాబాద్ జిల్లాలోని అనంతగిరి అడవుల్లో వనపర్తి జిల్లాకు చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గోపాల్‌పేట మండలం ఏదుట్ల గ్రామానికి చెందిన నరసింహకు పెద్ద కుమారుడు రమేష్, చిన్న కుమారుడు చంద్రశేఖర్ ఉన్నారు. వీరు హైదరాబాద్‌లోనే నివాసం ఉంటున్నారు. పెద్ద కుమారుడు రమేష్ కాంట్రాక్టర్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి నాలుగేళ్ల క్రితం వివాహం కాగా, ఐదు నెలల కుమార్తె ఉంది. ఇటీవలే భూభారతిలో సర్వేయర్ల కోసం నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణత పొంది ప్రస్తుతం హైదరాబాద్‌లోనే శిక్షణ తీసుకుంటున్నాడు. జూన్ 29వ తేదీన ఆదివారం ఇంటి నుంచి బయటికి వెళ్లిన రమేష్ రాత్రి వరకు తిరిగి రాలేదు. రాత్రి పది గంటల సమయంలో ఇంటి నుంచి ఫోన్ చేయగా వస్తున్నానని కుటుంబ సభ్యులకు చెప్పి రాలేదు. మరుసటి రోజు నుంచి అతని ఫోన్ క లవలేదు. మంగళవారం వరకు ఇంటికి రాకపోయే సరికి కుటుంబ సభ్యు లు హైదరాబాద్‌లోని గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు అతని ఫోన్ లోకేషన్‌ను చూడగా వికారాబాద్‌లోని అనంతగిరి అడవుల్లో చూయించింది. వెంటనే వికారాబాద్ పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు అడవుల్లోకి వెళ్లారు. అక్కడ ఓ చెట్టుకు ఉరి వేసుకుని రమేష్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు మృతదేహాన్ని వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించడంతో గురువారం స్వగ్రామమైన ఏదుట్ల గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. రమేష్‌కు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేవ ని, అతను ఆత్మహత్య చేసుకోవడానికి గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉందని గ్రామస్థులు చెబుతున్నారు.

వివాహేతర సంబంధం తట్టుకోలేకే..

- తండ్రి, కుమారుడు కలిసి హత్య
- వీడిన మహిళ అనుమానాస్పద మృతి కేసు

అయిజ టౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణంలో ఈ నెల 1వ తేదీన అనుమానాస్పదవంగా మృతి చెందిన వడ్ల సరోజ (40) కేసును పోలీసులు ఛేదించారు. గురువారం సాయంత్రం పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి డీఎస్పీ మొగులయ్య, శాంతినగర్ సీఐ టాటాబాబు, అయిజ ఎస్‌ఐ శ్రీనివాసరావుతో కలిసి వివరాలను వెల్లడించారు. ధరూరు మండల కేంద్రానికి చెందిన వడ్ల రాము అలియాస్ రామాచారికి 2001లో అయిజకు చెందిన వడ్ల సరోజ అలియాస్ వీరమ్మతో వివాహమైంది. వీరికిద్దరు కుమారులు ఉన్నారు. కాగా సరోజ వేరే వారితో వివాహేతర సంబంధం కొనసాగిస్తుందని, విషయంపై ఆమెను మందలించినా మార్పు రాలేదు. కొన్ని సార్లు రాము భార్యను కొట్టేవాడు. ఈ క్రమంలోనే 2009లో భర్తపై ధరూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసులో రాము జైలుకెళ్లాడు. జైలు నుంచి బయటికి వచ్చిన తర్వాత పెద్దల సమక్షంలో కేసు విషయంలో భార్యభర్తలు రాజీపడ్డారు. 2010లో భార్య సరోజను తీసుకుని భర్త రాము సొంతూరు అయిన ధరూరు వెళ్లి కాపురం పెట్టాడు. ఆ క్రమంలో వీరిద్దరికి కూతురు వైష్ణవి జన్మించింది. ఆ తర్వాత కూడా భార్య ఇతరులతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న విషయాన్ని రాము గ్రహించి, పెద్దల సమక్షంలో విడిపోయారు. సరోజ అయిజ పట్టణంలో ముగ్గురు పిల్లలతో కలిసి ఉంటుండగా, రాము ధరూరులో ఉండేవాడు. 2012లో రాము సమీప బంధువు అయిన కర్నూలు జిల్లా కోస్గి గ్రామానికి చెందిన సుజాతను రెండో పెళ్లి చేసుకున్నాడు. ఈ వివాహం తరువాత రెండేళ్ల బెంగుళూరులో ఉండి, తిరిగొచ్చి రెండో భార్య ఊరైన కోస్గిలో కార్పెంటర్ పనిచేసుకుంటూ జీవిస్తుండేవాడు. రెండో భార్యకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. అప్పుడప్పుడు అయిజలో ఉన్న మొదటి భార్య పిల్లలను చూసి వస్తుండే వాడు. ఈ క్రమంలో తన భార్య ఇంకా చెడు ప్రవర్తనను మార్చుకోలేదని తెలుసుకుని నచ్చజెప్పేవాడు. ఆమె ప్రవర్తనలో మార్పు రావటం లేదని దీంతో పెద్ద కుమారుడు వినోద్‌కు పెళ్లి సంబంధాలు కూడా రావటం లేదని ఆవేదన చెందేవాడు. సరోజను చంపేస్తే సమస్య తీరిపోతుందని నిర్ణయించుకుని మంగళవారం కోస్గి నుంచి ద్విచక్ర వాహనంపై రాము అయిజకు రాగా, తల్లి సరోజ వద్ద ఉన్న కుమారుడు వినోద్ కలిసి గొడవపెట్టుకుని తలను నేలపై ఉన్న బండకు బలంగా బాదగా మృతి చెందింది. విచారణ జరిపి నిందితులు వడ్లరాము అలియాస్ రామాచారి, వినోద్ అలి యాస్ వడ్ల వినోద్‌ను గురువారం రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

అనుమతి లేకుండా వెంచర్‌లో బ్లాస్టింగ్

జడ్చర్ల, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మునిసిపాలిటీలోని నాగశాల సమీపంలో ఓ వెంచర్‌లో గురువారం అనుమతి లేకుండా బ్లాస్టింగ్ నిర్వహించిన వాహనాన్ని పోలీసులు సీజ్ చేశారు. వెంచర్‌లో ఉన్న రాళ్లను తొలగించేందుకు నిర్వాహకులు బ్లాస్టింగ్ చేయడంపై కేసు చేశారు.

ఇసుక తరలిస్తున్న టిప్పర్, ట్రాక్టర్ పట్టివేత

కోస్గి రూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఇసుకను అక్రమ తరలిస్తున్న గుండుమాల్, మద్దూర్ గ్రామాలకు చెందిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం ఎస్‌ఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. గుండుమాల్ వాగు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్ గొల్ల కృష్ణయ్య పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. అలాగే ఓ టిప్పర్‌ను కోస్గిలో ని సీహెచ్‌సీ వద్ద గుర్తించి మద్దూర్ చెందిన డ్రైవర్ రామకృష్ణారెడ్డిపై కేసు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- గద్వాల పట్టణ ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్

గద్వాల క్రైం, జులై 3 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇటీవలే కొన్ని సైబర్ నేరాలకు సంబంధించి కేసులు నమోదు చేసినట్లు గద్వాల పట్టణ ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఇటీవల జరిగిన కేసుల వివరాలను పోలీస్‌స్టేషన్‌లో వెల్లడించారు. లోన్ అప్రూవల్ చేస్తామని, బాధితులకు ప్రాసెసింగ్ ఫీజులు డిమాండ్ చేస్తూ నకిలీ రుణ మంజూరు సందేశాలు, కాల్‌లు వచ్చాయని, చెల్లించిన తర్వాత మోసగాళ్లు అందుబాటులో లేకుండా పోయారన్నారు. ఇందులో బాధితుడికి రూ.5 లక్షలు లోన్ ఇస్తామని చెప్పి, చార్జీల కింద రూ. 40,270 పోగొట్టుకొని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి డబ్బులను ఫ్రీజ్ చేశామన్నారు. స్టాక్ మార్కెట్ పెట్టుబడి మోసంలో నకిలీ యాప్‌లో ఓ బాధితుడు రూ. 50వేలు పెట్టి మోసపోగా ఇందులో రూ. 23,420 ఫ్రీజ్ చేశామన్నారు. పార్ట్ టైం ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పడంతో కొందరు డబ్బులు చెల్లించి మోసపోయి ఫిర్యాదు చేశారన్నారు. ఇద్దరు బాధితులకు సంబంధించి రూ. 6,53,000 పోగొట్టుకోగా ఇందులో రూ. 50,757 ఫ్రీజ్ చేసినట్లు తెలిపారు. సైబర్ నేరాలపై అందరూ అప్రమత్తంగా ఉండాలని, సైబర్ మోసగాళ్ల చేతితో డబ్బులు పోగొట్టుకుంటే వెంటనే 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. అలా చేస్తే డబ్బులను ఫ్రీజ్ చేసే అవకాశాలు ఉంటాయన్నారు.

'ఉపాధి' పనులపై విచారణ

గద్వాల, జూలై 3 (ఆంధ్రజ్యోతి): గద్వాల మండలంలో గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకు ఉపాధి హామీ పథకంలో నిర్వహించిన రూ.8.60కోట్ల పనులపై గురువారం అదనపు కలెక్టర్ నర్సింగరావు ఆధ్వర్యంలో మండల పరిషత్ ఆవరణలో బహిరంగ విచారణ చేపట్టారు. ఉపాధి హామీ పథకం ద్వారా రూ.4.70కోట్ల పనులు జరిగాయి. ఇందులో రూ. 4.07కోట్లు వేతనాల రూపంలో, రూ.62.80 లక్షల మెటీరియల్ చెల్లింపులు చేశారు. అదేవిధంగా పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.3.88కోట్ల మెటీరియల్ చెల్లింపులు, రూ.2.29లక్షల వేతనాల రూపంలో చెల్లించారు. వీటిపై స్టేట్ రీసోర్స్ పర్సన్ రాజు ఆధ్వర్యంలో పది మంది డీఆర్‌పీలతో 12 రోజుల పాటు విచారణ చేశారు. ఈ విచారణలో అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. కొలతలలో లోపాలు, ఎక్కువ బిల్లుల చెల్లింపులు, పనికి రాని వారిపై వేతనాల చెల్లింపులు, హాజరు నమోదులో లోపాలు వంటివి బయటపడ్డాయి. పని అనుమతులు ఒకచోట ఉంటే మరోచోట నిర్వహణతో పాటు భారీగా అవినీతి బయటపడుతున్నట్లు తెలుస్తుంది. విచారణ నెమ్మదిగా సాగడంతో అదనపు కలెక్టర్ బాధ్యులపై రికవరీలు, జరిమానాలు, షోకాజ్‌నోటీసులు జారీ చేస్తున్నప్పటికీ బయటకు రాకుండా చూసుకుంటున్నారు. కాగా ఏడు గ్రామాల్లో రూ.86,952 అవినీతి జరిగినట్లు తెలిపారు. విచారణ అర్ధరాత్రి వరకు జరిగే అవకాశం ఉండటంతో శుక్రవారం వివరిస్తామని ఏపీవో విజయలలిత తెలిపారు.

ప్రకృతి ఒడిలో.. పెళ్లి పందిరి



కొల్లాపూర్ నుంచి నల్లమల అడవి మధ్య సోమశిల గ్రామానికి వెళ్లే రహదారి

- డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు వేదిక కానున్న సోమశిల
- కృష్ణానది తీరాన పెళ్లిళ్లు, శుభకార్యాలకు అవకాశం
- ఆధునిక, విలాసవంతమైన భవనాల నిర్మాణం
- కొత్త అందాలను సంతరించుకోనున్న పర్యాటక కేంద్రం

కొల్లాపూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రాల్లో సోమశిల కూడా ఒకటి. ఒకవైపు రెండు కొండల నడుమ పరవళ్లు తొక్కే కృష్ణానది, మరో వైపు ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లే లలితాంబికా సోమేశ్వరాలయం పర్యాటకులను ఆకట్టుకుంటోంది. తాజాగా డెస్టినేషన్ వెడ్డింగ్‌ల కోసం అభివృద్ధి చేసేందుకు ఎంపిక చేయడంతో సోమశిల ప్రాంతం కొత్త సొబగులను సంతరించుకోనున్నది. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో అందుకు అవసరమయ్యైన అన్ని సదుపాయాలు కల్పించనున్నది. కృష్ణానది తీరాన ఆధునిక, విలాసవంతమైన భవనాలను నిర్మించనున్నారు.

అతిథులకు అవసరమైన గెస్ట్‌హౌస్‌లు, సదస్సుల నిర్వహణ కోసం కాన్ఫరెన్స్ హాళ్లు, ఫొటో, వీడియో సెషన్ల కోసం ఉద్యానవనాలు, సెల్ఫీపాయింట్లు, చిన్నారులు ఆడుకునేందుకు అవసరమైన ఉయ్యాలలు, జారుడు బల్లలు తదితర సౌకర్యాలు కల్పించనున్నారు. దీంతో దేశవ్యాప్తంగా ప్రసిద్ధి గాంచిన వెడ్డింగ్ డెస్టినేషన్ కేంద్రాలు జైపూర్, రాజస్థాన్, ఉదయ్‌పూర్, గోవా, ఊటీ, కేరళ తదితర ప్రాంతాల సరసన మన సోమశిల కూడా చేరబోతున్నది.

రాష్ట్రంలో నాలుగు ప్రాంతాలు

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పర్యాటక పాలసీ మేరకు వెడ్డింగ్ డెస్టినేషన్‌ను అభివృద్ధి చేసేందుకు రాష్ట్రంలో నాలుగు ప్రాంతాలను గుర్తించింది. హైదరాబాద్ నుంచి రాకపోకలకు సులువుగా ఉన్న ఆహ్లాదకర ప్రాంతాలకు ప్రాధాన్యం ఇచ్చింది. అందులో కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్, యాదాద్రి భువనగిరి జిల్లాలోని బస్వాపూర్, నల్లగొండ జిల్లాలోని నాగార్జునసాగర్, బుద్ధవనం ప్రాజెక్టు, వీటితో పాటు సోమశిల ప్రాంతాల్లో వెడ్డింగ్ డెస్టినేషన్ అభివృద్ధి కోసం స్థలాలను గుర్తించారు. ఈ విషయంపై టూరిజం శాఖ అధికారులు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి చర్చించినట్లు తెలిసింది.

అందరికీ అందుబాటులో..

ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలకు చెందిన సంపన్న కుటుంబాలు వివాహ వేడుకలను నిర్వహించుకునేందుకు రాజస్థాన్, జైపూర్, ఊటీ, కేరళ ప్రాంతాలను ఎంపిక చేసుకుంటున్నారు. అందుకోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. బంధు మిత్రులతో దూర ప్రాంతాలకు వెళ్లేందుకు వ్యయ ప్రయాసలకు గురవుతుంటారు. తాజాగా సోమశిల ప్రాంతాన్ని డెస్టినేషన్ వెడ్డింగ్‌ల కోసం అభివృద్ధి చేయనుండటంతో అందరికీ అందుబాటులోకి రానున్నది. అత్యంత ఆర్భాటంగా పెళ్లిళ్లు, శుభకార్యాలు, విందులు, వినోదాలు నిర్వహించుకునేందుకు అవకాశం లభించనున్నది. దీంతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయి సభలు, సమావేశాలు, చర్చాగోష్ఠిలు, వర్క్‌షాపులు నిర్వహించుకునేందుకు వసతులను పర్యాటక శాఖ కల్పించనున్నది.

మరచిపోలేని అనుభూతి

వివాహాలను స్థానిక ఫంక్షన్ హాళ్లలో నిర్వహించుకోవడం సర్వసాధారణం. అలా కాకుండా దూర ప్రాంతాలకు వధూవరులు, వారి కుటుంబసభ్యులు, స్నేహితులతో కలిసి వెళ్లి ఆధునిక వసతులు, ప్రకృతి అందాలు, రాజభవనాల్లో వివాహం చేసుకోవడాన్ని డెస్టినేషన్ వెడ్డింగ్ అంటారు. ఇలా పెళ్లి చేసుకోవడం వారికి మరచిపోలేని అనుభూతిని కలిగిస్తుంది. మనసుకు నచ్చిన ప్రదేశంలో, ఆహ్లాదకర వాతావరణంలో, బంధు మిత్రుల సమక్షంలో నిర్వహించుకునే ఈ వేడుకలు వారికి మరచిపోలేని అనుభూతిని అందిసాయి. ప్రస్తుతం మన దేశంలోని గోవా సముద్ర తీరం, ఊటీ పర్వత ప్రాంతాలు, ఉదయపూర్, జైపూర్, రాజస్థాన్‌లలోని రాజమహల్‌లలో వెడ్డింగ్ డెస్టినేషన్ జరుగుతున్నాయి. త్వరలోనే ఆ జాబితాల్లో మన సోమశిల కూడా చేరనున్నది.



వరద జలాలతో నిండుకుండలా సోమశిల వద్ద కృష్ణానది

జానంపేటలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల

- భవన నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించిన అధికారులు

మూసాపేట, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలంలోని జానంపేట జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో గురువారం ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం కోసం స్థలాన్ని అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ పరిశీలించారు. ప్రభుత్వం నియోజకవర్గానికి రెండు ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా దేవరకద్ర నియోజకవర్గంలో జానంపేట పాఠశాల ఆవరణలో ఐదు ఎకరాల పొలం ఉండగా, పాఠశాల ఏర్పాటుకు మూడు ఎకరాలు అవసరం ఉందని అధికారులు తెలిపారు. ఇక్కడ స్థలంతో పాటు పాఠశాలలోని వసతులు, సౌకర్యాలపై ఆరా తీశారు.



జానంపేట జెడ్పీహెచ్ఎస్ వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, డీఈవో ప్రవీణ్‌కుమార్, అధికారులు

అదేవిధంగా జెడ్పీ ఉన్నత పాఠశాలలోకి వెళ్లి విద్యార్థులచే ఆంగ్లం చదివించి విద్యాప్రమాణాలు తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులు, ఉచితంగా పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు. పాఠశాల ఆవరణలో ప్రహరీ, అదనపు గదుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో డీఈవో ప్రవీణ్‌కుమార్, ఏఎంవో దుంకుడు శ్రీనివాస్, ఎంపీడీవో కృష్ణయ్య, ఎంఈవో రాజేశ్వర్‌రెడ్డి, హెచ్‌ఎం గీతారాణి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యం

- నారాయణపేట మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి




మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి

దామరగిద్ద, జూలై 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పని చేయాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. నారా యణపేట జిల్లా దామరగిద్ద మండలంలోని గడిమున్కన్‌పల్లిలో మండల కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు.. ఎక్కడ చూసినా బీఆర్ఎస్ పదేళ్లలో చేసి న అభివృద్ధే కనిపిస్తుందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇప్పటి వరకు చేసిందేమీ లేదన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారన్నారు. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎన్నికలు ఎప్పుడు వచ్చినా తగిన బుద్ధి చెప్పటానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో సుభాష్, చంద్ర కాంత్, వెంకట్‌రెడ్డి, బక్క నర్సప్ప, దామోదర్ రెడ్డి, బసంత్‌రాజ్ పటేల్, నాయకులు పాల్గొన్నారు.

ధ్యానం చేస్తే శరీరంలో ప్రతీ కణం పునరుత్తేజం

- పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్



మాట్లాడుతున్న పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్

పాలమూరు యూనివర్సిటీ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ధ్యానం చేస్తే శరీరంలో ప్రతీ కణం పునరుత్తేజం చెందుతుందని పీయూ వీసీ జీఎన్ శ్రీ నివాస్ అన్నారు. గురువారం యూనివర్సిటీలోని ఫార్మసీ ఆడిటోరియంలో ఎన్ఎస్ఎస్ సెల్, కన్హా శాంతివనం ఇన్‌స్టిట్యూట్ సంయుక్తంగా హార్ట్‌ఫుల్‌నెస్ మె డిటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. రోజువారి జీవితంలో బిజీగా ఉన్న ఉద్యోగులకు, విద్యార్థులకు ఉపశమనం కలగాలంటే మెడిటేషన్ చేయాలన్నారు. అనంతరం ముఖ్య వక్త కృష్ణారావు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ధ్యాన్యంను దినచర్యలో భాగంగా మార్చుకో వాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పూస రమేష్ బాబు, కన్వీనర్ చంద్రకిరణ్, కో-కన్వీనర్ ప్రవీణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు, హార్ట్‌ఫుల్ ఫౌండేషన్ ప్రతినిధులు రామ్‌రెడ్డి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల శ్రమను గుర్తించని వ్యవస్థను నిలదీయాలి

- ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి

వనపర్తి టౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మహిళ శ్రమను గుర్తించని వ్యవస్థను నిలదీయాల్సిన అవసరముందని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. గురువారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ఐద్వా సంఘం కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. ప్రస్తుతం దేశంలో ప్రభుత్వ విధానాలు కార్మికులకు వ్యతిరేకంగా, మహిళలకు అన్యాయంగా మారుతున్నాయన్నారు. రోజురోజుకు ప్రైవేటీకరణ పెరుగుతుందని, కనీస వేతనం అమలు చేయడం లేదన్నారు. ఆరోగ్య, విద్య హక్కు, భద్రత వంటివి మహిళలకు యదార్థంగా లభించాలంటే పోరాటం సాగించాల్సిందేనన్నారు. జూలై 9న జరగనున్న సార్వత్రిక సమ్మె ఈ పోరాటానికి ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు. రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి మాట్లాడుతూ.. మహిళలపై జరిగే దాడులను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయ న్నారు. సమావేశంలో లక్ష్మి, సాయిలీల, కవిత, ఉమా, శాంతమ్మ తదితరులు పా ల్గొన్నారు.

మరింత వేగంగా పోస్టల్ సేవలు

- మహబూబ్‌నగర్ డివిజన్ పోస్టల్ పర్యవేక్షకురాలు విజయజ్యోతి
- తపాలా కార్యాలయంలో ఇండిపెండెంట్ డెలివరీ సెంటర్ ప్రారంభం



ఇండిపెండెంట్ డెలివరీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న డివిజన్ పోస్టల్ పర్యవేక్షకురాలు విజయజ్యోతి

మహబూబ్‌నగర్ టౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రధాన తపాలా కార్యాలయంలో ఇండిపెండెంట్ డెలివరీ సెంటర్‌ను డివిజన్ పోస్టల్ పర్యవేక్షకురాలు విజయజ్యోతి గురువారం ప్రారంభించారు. ఏళ్లుగా సైకిల్‌పై ఉత్తరాలు పోస్టుమాన్ ఇచ్చేవారని, ప్రస్తుత పరిస్థితులకి అనుగుణంగా టూవీలర్‌పై డెలివరీ ఇవ్వడం ఇండిపెండెంట్ డెలివరీ సెంటర్ యొక్క ముఖ్య ఉద్దేశమని ఆమె పేర్కొన్నారు. టూవీలర్ లేని వారికి టూవీలర్ ఏర్పాటు చేయడం, ఉన్న వారికి పెట్రోల్ ఖర్చులు చెల్లిస్తామన్నారు. దీంతో పాటు ఆదివారాలు కూడా డెలివరీ చే స్తారని, దీంతో ఉత్తరాలు మరింత వేగంగా ప్రజలకు ఇవ్వడానిక ఎంతో దోహద పడుతుందన్నారు. కార్యక్రమంలో పోస్టల్ ఇన్‌స్పెక్టర్ వంశీ, అశోకరెడ్డి, తపాలా శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్ ఫలితాలు విడుదల

మహబూబ్‌నగర్‌స్పోర్ట్స్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): హకీంపేటలోని స్పోర్ట్స్ స్కూల్‌లో 4వ తరగతి ప్రవేశాలకు జిల్లా స్థాయి నుంచి ఎంపికైన విద్యార్థుల వివరాలను డీవైఎస్‌వో శ్రీనివాస్ గురువారం విడుదల చేశారు. పది మంది బాలురు, 8 మంది బాలికలను ఎంపిక చేశారు. బాలుర విభాగంలో కొత్తపల్లి ప్రేమ్ కుమార్, ముడావత్ యశ్వంత్, జీ.రిషితేజ్, బెక్కరి వర్షిత్, కట్ల ఆదిత్య, చాకలి మోక్షిత్, కే. జయంత్‌మణి, ఏ.శౌర్యయాదవ్, నదీశ్వర్, మదుపార్థ, బాలికల విభాగంలో బద్రవత్ వరలక్ష్మి, భావ్యశ్రీరాథోడ్, వింజమూరి భవ్యశ్రీ, కుమ్మరి శిరీ ష, హరిక, గోద లిఖిత, కుర్వప్రణవి ఎంపికయ్యారు. విద్యార్థుల జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్, హెచ్‌ఎం జారీ చేసిన మూడవ తరగతి బోనఫైడ్, ఉత్తీర్ణత సాధించిన ధ్రువీకరణ పత్రం, రెండు ఫొటోలతో హకీంపేట్‌లోని స్పోర్ట్స్ స్కూల్‌కు హాజరుకావాలన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

కల్వకుర్తి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో గత నెల జిల్లా స్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు న్విహించారు. ఇందులో జెడ్పీహెచ్ఎస్ 7వ తరగతి విద్యార్థి జ్యోష్ణవి ప్రతిభ కనబరిచింది. ఈ నెల 5, 6వ తేదీల్లో హనుమకొండ జిల్లాలోని జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియంలో 11వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో జిల్లా తరఫున ట్రయాథలిన్ అథ్లెటిక్స్ పోటీలో పాల్గొంటుందని పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ వెంక టరమణ, ఫిజికల్ డైరెక్టర్ యాదయ్యగౌడ్ గురువారం తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన ఆమెను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

జెన్‌కో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- జెన్‌కో సీఈకి వినతి



జెన్‌కో సీఈకి బొకె అందిస్తున్న ఉద్యోగులు, కార్మికులు

దోమలపెంట, జూలై 3 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని గురువారం జెన్‌కో నూతన సీఈ కేవీవీ సత్యనారాయణను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా 1535 యూనియన్ రా ష్ట్ర ఉపాధ్యక్షుడు సుంకరి లవకుమార్, టీఆర్‌వీకేఎస్ నాయకుడు కావేడి రాము మాట్లాడుతూ.. ఉద్యోగులకు, కార్మికులకు సరైన వైద్యం, డీఏవీ పాఠశాలలో నాణ్యమైన విద్యాబోధన అందడం లేదన్నారు. అంబులెన్స్, క్యాంటీన్ మరమత్తులు, రెండు రెస్ట్ రూములు, మరుగుదొడ్లు, మూ త్రశాలలు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈగలపెంట సీఈ సర్కిల్ కార్యాలయంలో పనిచేస్తున్న వారిని, భూగర్భ కేంద్రంలో విధులు పాల్గొనే వారికి మార్పులు చేర్పులు చేయాలన్నారు. ఉద్యోగులు ఆరోగ్యంగా ఉండేందుకు అన్ని వసతులతో గ్రౌండ్‌ను ఏర్పాటు చేయాని కోరారు. అన్ని సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్ర మంలో తిరుపతయ్య, హనుమంతు, శ్రీనివాస్, విజయ్, వెంకటయ్య, గురువయ్య, ప్రసాద్, మత్రు, పీర పాల్గొన్నారు.

ధరూర్‌లో పట్టపగలే చోరీ

- బంగారు, నగదు అపహరణ

ధరూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా దరూరు మండల కేంద్రంలో గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న బంగారు, నగదు అపహరించినట్లు బాధితుడు తెలిపారు. కారు డ్రైవర్ ఉప్పరి రవి స్థానిక బీసీ కాలనీలో నివాసముంటున్నాడు. గురువారం కుటుంబ సభ్యులు ఎవరూ ఇంట్లో లేకపోవడంతో మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో దుండగులు ఇంట్లోని మూడు తులాల బంగారం, నగదు, కొద్దిపాటి వెండిని అపహరించినట్లు తెలిపారు. బీరువా పగులగొట్టి ఉండటాన్ని గమనించి కుటుంబ సభ్యులకు తెలిపారు. బాధితుడు రవి ధరూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ శ్రీహరి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

200 మిలియన్ యూనిట్లకు చేరువలో విద్యుదుత్పత్తి

ఆత్మకూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : జూరాలలోని జల విద్యుదుత్పత్తి 200 మిలియన్ యూనిట్లకు అతి చేరువలో ఉందని ఎస్ఈ శ్రీధర్ గురువారం తెలిపారు. ఎగువ నుంచి ఆశించిన మేర వరద వస్తున్నందున ఎగువ ఉత్పత్తి కేంద్రంలో ఐదు యూనిట్లు ప్రారంభించి 3.374 మిలియన్ యూనిట్ల ఉత్పత్తిని రా బట్టగలిగామని తెలిపారు. ఇప్పటి వరకు 82.817 మిలియన్ యూనిట్లను చేప ట్టినట్లు పేర్కొన్నారు. దిగువ కేంద్రంలో ఆరు యూనిట్లను ప్రారంభించి 4.388 మిలియన్ యూనిట్ల ఉత్పత్తిని, ఇప్పటి వరకు 99.730 మిలియన్ యూనిట్లను రాబట్టినట్లు తెలిపారు. వరద ఇలాగే కొనసాగితే నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించే అవకాశం ఉందని తెలిపారు.

నల్లకుంట చెరువులో అక్రమ కట్టడాలు తొలగింపు

జడ్చర్ల, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల మునిసిపాలిటీ పరిధిలో ఉన్న నల్లకుంట చెరువులో నిర్మించిన ప్రహరీని గురువారం మునిసిపల్, ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారులు కూల్చివేశారు.

ఎఫ్ టీఎల్‌లో నిర్మాణాలు చేపట్టవద్దంటూ ఇరిగేషన్ శాఖ నోటీసులు జారీ చేసినా చేపట్టారని తెలిపారు. ఈ అంశంపై ఎఫ్‌టీఎల్‌లో పట్టా భూమి యజమానులు కోర్టుకు వెళ్లారు. చెరువును డీనోటిఫైడ్ చేయాలంటూ ఎఫ్‌టీఎల్‌లో నీరు నిల్వ ఉండటం లేదంటూ అదనపు కలెక్టర్‌కు అర్జీ పెట్టుకున్నారు.

ఎఫ్‌టీఎల్‌లో ఉన్న నిర్మాణాలు తొలగించాలని కోర్టు ఇచ్చిన ఆదే శాలమేరకు కూల్చివే స్తున్నట్లు అధికారులు తెలిపారు. నోటీసులు లేకుండా ఎలా కూలుస్తారంటూ అధికారులను భూమి యజమానులు ప్రశ్నించారు. మునిసిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి చేరుకుని కోర్టు ఆదేశాలమేరకే నిర్మాణాలను కూల్చి వేసున్నట్లు పేర్కొన్నారు. ఎస్‌ఐ మల్లేష్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.


shanthi TALKIES
MYTHRI MOVIE DISTRIBUTORS LLP
RELEASING TODAY
SIDDHARTH
SARATH KUMAR
3BHK
'Every Ordinary Family has an Extraordinary Story'
WRITER - DIRECTOR SRI GANESH
PRODUCED BY ARUN VISWA


ప్రపంచవ్యాప్తంగా
నేడే
విడుదల
జురాసిక్ వరల్డ్ రీబర్త్
IN CINEMAS JULY 4
RELEASING IN ENGLISH, HINDI, TAMIL AND TELUGU
IN 3D
UNIVERSAL


ANIL SUNKARA PROUDLY PRESENTS
SKYLINE MOVIES
SHOW TIME
నేడే
విడుదల
WRITTEN & DIRECTED BY
MADHAN DAKSHINAMOORTHY
PRODUCER
KISHORE GARIKIPATI (G K)


ప్రపంచవ్యాప్తంగా
జూలై
11
విడుదల
IT BEGINS
A JAMES GUNN FILM
DC STUDIOS
సూపర్‌మ్యాన్
SUPERMAN
ONLY IN CINEMAS JULY 11
IN ENGLISH, HINDI & TELUGU
IN 3D & IMAX 3D
WARNER BROS. PICTURES RELEASE THROUGH NVR CINEMA - 9966963111


SMT. ANITHA PRESENTS
SRI VENKATESWARA CREATIONS
DIL RAJU PRODUCTION
T-SERIES
నేడే
విడుదల
NITHIIN
తమ్ముడు
SRIRAM VENU
RAJU SHIRISH
K V GUHAN B.AJANEESH LOKNATH SH.PRAWIN PUDI G M SEKHAR

ఇంటర్వ్యూ..

అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు

» మంజుల, ఎంపీడీవో, ధరూరు



ధరూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా చేస్తామని ఎంపీడీవో మంజుల తెలిపారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లను జాప్యం జరుగకుండా నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. అలాగే గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారించేందుకు చర్యలు చేపడతామని 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో తెలిపారు.

గ్రామాల్లో కార్యదర్శుల పనితీరు ఎలా ఉంది?

మండలంలో 28 గ్రామ పంచాయతీల కార్యదర్శుల పనితీరుపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉంటుంది. వారి విధులపై మండల పరిషత్ కార్యాలయంలో ఎప్పటికప్పుడు కార్యదర్శులతో సమీక్ష నిర్వహిస్తున్నాం.

ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయా?

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో గ్రామాలకు సంబంధించి లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లను అందజేశారు. పత్రాలు అందుకున్న వారు 40రోజుల్లో నిర్మాణాలు చేపట్టాల్సి ఉంటుంది. వాటిపై గ్రామాల్లో కార్యదర్శుల ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగుతుంది.

పారిశుధ్య నివారణ చర్యలు చేపడుతున్నారా?

వర్షాకాలంలో గ్రామ కార్యదర్శులకు పారిశుధ్య నివారణ చర్యలు చేపట్టేందుకు గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నాము. రోడ్లపై మురుగునీరు పారేవిధంగా చేస్తే వారిపై చర్యలు తీసుకుంటాము.

ప్రజాపాలనలో అర్హులకు ప్రభుత్వ పథకాలు అందాయా?

ప్రజాపాలనలో భాగంగా ప్రభుత్వ పథకాలు ప్రతీ లబ్ధిదారుడికి అందేందుకు చర్యలు తీసుకుంటున్నాం. సర్వేలో భాగంగా ప్రతీ గ్రామానికి వెళ్లి మండల స్థాయి అధికారులతో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పరిశీలించి, అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకున్నాము.

న్యూస్ బాక్స్

ఎమ్మెల్యేను కలిసిన మునిసిపల్ కమిషనర్



ఎమ్మెల్యే విజయుడికి మొక్కను ఇస్తున్న మునిసిపల్ కమిషనర్ శ్రీరాములు

అలంపూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): అలంపూర్ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీరాములు గురువారం ఎమ్మెల్యే విజయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు తెలుసుకుని మునిసిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, ఉపాధ్యాయుడు వెంకటేశ్ పాల్గొన్నారు.

పాఠశాలల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

● డీసీఈబీ కార్యదర్శి ప్రతాప్ రెడ్డి



దోర్నాల పాఠశాలలో స్కావెంజర్‌కు సూచనలిస్తున్న కాంప్లెక్స్ హెచ్‌ఎం

ధరూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో ఎలాంటి అపరిశుభ్రతకు తావులేకుండా పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా ఉన్నత పాఠశాలల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు, జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు కార్యదర్శి (డీసీఈబీ) ప్రతాప్‌రెడ్డి సూచించారు. ధరూర్ మండలంలోని దోర్నాల, గుర్రంపల్లి, సోంపురం గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలను గురువారం డీసీఈబీ కార్యదర్శి సందర్శించారు. మధ్యాహ్న భోజనం పథకం అమలు తీరును పరిశీలించారు. మెనూ తప్పకుండా పాటించాలని చెప్పారు. అనంతరం సోంపురంలోని శిథిలావస్థలో ఉన్న వంట గదిని పరిశీలించారు. డీసీఈబీ వెంట సీఆర్‌పీ నరసింహులు ఉన్నారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు

ధరూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): కార్మిక చట్టాలు, హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తూ శ్రమదోపిడీకి పాల్పడుతున్నారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పేరు నరసింహ అన్నారు. కార్మిక రంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం జూలై 9న దేశవ్యాప్తంగా తల పెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సార్వత్రిక సమ్మె పోస్టర్లను గురువారం ధరూర్ మండల కేంద్రంలో నాయకులు విడుదల చేశారు. కార్యక్రమంలో మేకల నర్సింహ, మోష, టీయూసీఐ నాయకులు రంగన్న, హమాలీ, గ్రామ పంచాయతీ కార్మికులు శంకరన్న, సవారన్న, బజారమ్మ, మహేశ్వరి, రంగన్న, గ్రంథాలయం కార్మికుడు గోవిందు, అశోక్ ఉన్నారు.

ఇంటికి నాలుగు మొక్కలు పెంచాలి

» వన మహోత్సవానికి సన్నద్ధం

» నర్సరీల్లో మొక్కలు సిద్ధం



మానవపాడులోని నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు

మానవపాడు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అధికారులు సన్నద్ధం అవుతున్నారు. దీనికోసం ఆయా గ్రామాలవారీగా లక్ష్యాలను నిర్దేశించారు. గ్రామాల్లో పంచాయతీలో ఏర్పాటు చేసిన నర్సరీల్లో ప్రస్తుతం మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. శనివారం నుంచి ఈ కార్యక్రమం గ్రామాల వారిగా ప్రారంభించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఇప్పటికే వనమహోత్సవం కార్యక్రమం కోసం ఉపాధి కూలీలు, పంచాయతీ కార్మికులు గుంతలు తీశారు. ఈ ఏడాది మండలంలోని 17గ్రామాల్లో 42వేల మొక్కలు నాటాలని లక్ష్యం పెట్టుకున్నారు. ఇందుకు 17 గ్రామాల్లో ప్రతి నర్సరీలో 6వేలు మొక్కలు పెంచాలని ప్రస్తుతం ప్రతీ నర్సరీలో 4వేల మొక్కలు సిద్ధంగా ఉండగా మరో 22వేల మొక్కల కోసం సన్నద్ధం చేస్తున్నారు. విద్యాసంస్థలు, ఖాళీ ప్రదేశాలు, వసతిగృహాలు, రోడ్లకు ఇరువైపు లా మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది ప్రతీ ఇంటికి నాలుగు మొక్కలు అందిస్తామని, వాటిని నాటి సంరక్షించాలని అన్నారు. ఇళ్లకు ఇచ్చే మొక్కలు పండ్ల, పూలమొక్కలు ఉంటాయని తెలిపారు.

మొక్కల పెంపకం అందరి బాధ్యత



గ్రామాల్లో మొక్కలు అధికంగా ఉన్నప్పుడే వర్షపాతం పెరుగుతుంది. రేపటి తరాల కోసం ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి వాటి సంరక్షణలో భాగం కావాలి. ప్రతీ ఇంటి ఆవరణలో మొక్కలు తప్పకుండా నాటి కలుష్యాన్ని తగ్గించాలి.

- రైతు నాగమద్దిలేటి, మానవపాడు

మొక్కలు తొలగిస్తే జరిమానా



వన మహోత్సవం కార్యక్రమం ప్రారంభించిన తర్వాత ప్రతీ గ్రామంలో మొక్కలు నాటిస్తాం. గ్రామాల్లో మొక్కలు తొలగిస్తే జరిమానా వేస్తాం. ఇప్పటికే మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. మండలానికి ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేసి వాటిని సంరక్షిం చేందుకు కృషి చేస్తాం.

- భాస్కర్, ఎంపీడీవో

నేటి సభను విజయవంతం చేయండి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

» రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండేటి మల్లయ్య

గద్వాల, జూలై 3(ఆంధ్రజ్యోతి) హైదరాబాద్‌లోని ఎల్బీస్టేడియంలో శుక్రవారం జరిగే సభను విజయవంతం చేయాలని రాష్ట్ర టీపీసీసీ ఉపాధ్యక్షుడు కొండేటి మల్లయ్య పిలుపునిచ్చారు. గురువారం హరిత హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ద్వార ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజల జీవన ప్రమాణం పెంచుతున్నదని, చేసిన పథకాలను ప్రజలలోకి విస్తృతంగా తీసుకు వెళ్లాల్సిన అవసరం ఉందని వివరించారు. అందుకు నేడు జరిగే సమావేశానికి కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్ రెడ్డితో పాలు మంత్రులు హాజరు అవుతున్నారని దీనిని నాయకులు కార్యకర్తలు విజయవంతం చేయాలన ఆయన కోరారు.

ఈ సమావేశంలో రాష్ట్ర జనరల్ సెక్రెటరీ ఫయూమ్, అధికార ప్రతినిధి శేక్షావలి ఆచారి, గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాను పకడ్బందీగా రూపొందించాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

● అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

● ప్రారంభమైన బీఎల్‌వో శిక్షణ తరగతులు

గద్వాల టౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పొరపాట్లు, తప్పులు లేకుండా ఓటర్ల జాబితాను పకడ్బందీగా సిద్ధంచేయాలని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ సూచించారు. భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గద్వాల అసెంబ్లీ నియోజకవర్గంలోని బూత్‌స్థాయి అధికారుల శిక్షణ కార్యక్రమం గురువారం స్థానిక ఎంఏఎల్‌డీ కళాశాలలో ప్రారంభమైంది. శిక్షణ తరగతులను ప్రారంభించిన అదనపు కలెక్టర్, ఈ నెల 9వ తేదీ వరకు సాగే శిక్షణ తరగతులకు ప్రతిరోజు 50మంది తగ్గకుండా బీఎల్‌వోలు పాల్గొనాలన్నారు. కొత్త ఓటర్ల నమోదు, మరణించిన లేదా ఇతర కారణాల వల్ల తొలగించాల్సిన పేర్లు, జాబితాలో అవసరమైన మేరకు చేపట్టే సవరణలను సంబంధించి ప్రత్యేక పారాలను వినియోగించాల్సి ఉంటుందన్నారు. 18 ఏళ్ల నిండిన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు లభించేలా జాబితాను రూపొందించాలన్నారు. ఓటర్ల జాబితాల సవరణలో బీఎల్‌వోలది కీలకపాత్ర అని, పకడ్బందీ జాబితా వల్ల పోలింగ్ సందర్భంగా ఎలాంటి ఇబ్బందుతు తలెత్తవన్నారు. కార్యక్రమంలో గద్వాల తహసీల్దార్ మల్లికార్జున్, మాస్టర్ ట్రైనర్లు అశోక్, నరేష్, సీనియర్ అసిస్టెంట్లు నాగేష్, అధికారులు ఉన్నారు.

ప్లాస్టిక్ కవర్లను వాడరాదు

వడ్డేపల్లి, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : నిషేధిత ప్లాస్టిక్ కవర్లను వాడరాదని మునిసిపల్ కమిషనర్ రాజయ్య దుకాణాల యజమానులకు సూచించారు. జాతీయ అంతరాష్ట్ర ప్లాస్టిక్ రహిత దినోత్సవం సందర్బంగా గురువారం వడ్డేపల్లి మునిసిపాలిటీ, శాంతినగర్‌లోని దుకాణాల యజమానులకు అవగాహన కల్పించారు. దుకాణాల్లో తనిఖీలు చేసి జరిమానా విధించారు. కార్యక్రమంలో నరసింహులు, నరేంద్ర, కృష్ణ, గజేంద్ర, రాజు, రమేష్, మహేశ్ ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలి

గద్వాల టౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): వాహనాల మరమ్మతు కోసం వచ్చే వారికి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని గద్వాల ట్రాఫిక్ ఎస్‌ఐ బాలచంద్రుడు సూచించారు. ప్రపంచ మెకానిక్‌ల దినత్సోవాన్ని పురస్కరించుకుని గురవారం పట్టణంలో బైక్ వాహన మెకానిక్‌ల అసోసియేషన్ ఆధ్వర్యంలో యూనియన్ జెండా ఎగురవేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ట్రాఫిక్ ఎస్‌ఐ మాట్లాడుతూ ట్రాఫిక్ ఉల్లంఘనల వల్లే ప్రమాదాలు పెరిగిపోతున్న విషయాన్ని వాహనదారులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ఎండీ సుభాన్, బైక్ మెకానిక్‌లు ఉన్నారు.

ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలి

అలంపూర్, జూలై 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని కంప్యూటర్‌లో పొందుపరిచే ఈ పంచాయతీ ఆపరేటర్ల సమస్యలను పరిష్కరించాలని ఆపరేటర్లు భార్గవ్‌రెడ్డి, నాగరాజు, శివకుమార్, మోహన్ గౌడ్, అశోక్, శాలిబాషా ఎమ్మెల్యే విజయుడిని కోరారు. గురువారం కర్నూలులో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. పనిభారం పెరిగిందని, వేతనం తగ్గించి ఇస్తున్నారని తెలిపారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం

గట్టు, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొర్లఖాన్‌దొడ్డి గ్రామంలో ఇటీవల మృతి చెందిన వీరేష్ కుటుంబాన్ని ఆదుకునేందుకు చిన్ననాటి స్నేహితులు ముందుకువచ్చారు. గ్రామానికి చెందిన వీరేష్ గతనెల 24న ట్రాక్టర్ ప్రమాదంలో మరణించారు. దీంతో 2012 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు పోగు చేసిన రూ.45,602లు గురువారం కుటుం బ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో హరికృష్ణ, శ్రీనివాసులు, వీరేష్, పరశు, తిమ్మప్ప, చంద్రశేఖర్, కృష్ణమూర్తి, శ్రీకాంత్, హనుమంతు, విజయ్, మోహన్, మంజునాథ్, సతీష్ ఉన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి

గద్వాల క్రైం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ అక్రమ కేసుల్లో భాగంగా గురువారం గద్వాల కోర్టుకు బీజేపీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు నరసింహయ్యశెట్టి, జలగరి అశోక్, శ్రీరాములు, రమేష్, మాదన్న కోర్టు బయట మాట్లాడారు. అవినీతి, అసమర్థ, మోసపూరిత పరిపాలనను, నియంత వైఖరిని ప్రశ్నించినందుకు గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అక్రమ కేసులు మోపిందన్నారు. ఆ కేసులను ఎత్తివేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు.

వేసిన పంటను తీయడం సరికాదు

● సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి

గద్వాల టౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): నెలరోజుల క్రితం నాటిన సీడ్ పత్తి మొక్కలను తొలగించాలంటూ రైతులను ఒత్తిడి చేస్తున్న ఆర్గనైజర్ల తీరు గర్హనీయమని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి అన్నారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో రైతుల సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఏ రైతు ఎన్ని ఎకరాల్లో విత్తనాలు నాటారన్న విషయం ఆర్గనైజర్లకు ముందుగానే తెలిసినా మౌనంగా ఉండి నెలతర్వాత ఆంక్షలు విధించడం సరికాదన్నారు.

ఆర్గనైజర్లు, కంపెనీలపై విత్తన పత్తి సాగు విషయంలో వ్యవసాయశాఖ పూర్తి అజమాయిషీ ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఉప్పేరు నరసింహ, రైతులు రంగన్న, శివరాజు ఉన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా నుషిత

గద్వాలన్యూటౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): గద్వాల జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా నుషిత గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఉన్న అధికారి రమేష్‌బాబు తన సొంతశాఖ అయిన అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్‌కు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో ఎస్సీ కార్పొరేషన్ ఈవో (ఎగ్జిక్యూటివ్ అధికారి)గా ఉన్న నుషిత ఈడీగా అదనపు బాధ్యతలు స్వీకరించారు.

మునిసిపాలిటీ స్థలాన్ని కాపాడాలి

గద్వాలక్రైం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని 34 వార్డులో కొందరు మునిసిపల్ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తూ గుడిసె ఏర్పాటు చేసుకున్నారని, ఈ స్థలాన్ని కాపాడాలని కాలనీవాసులు సుజాత, వెంకటేష్, కృష్ణతో పాటు మరికొందరు గురువారం మునిసిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మునిసిఖాళీ స్థలంలో ప్రజల అవసరాలకు తగ్గట్లుగా కమ్యూనిటీ భవనం కొరకు కేటాయించగా, కొందరు వ్యక్తులు ఆ స్థలాన్ని కబ్జా చేసేందుకే అక్కడ గుడిసెను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు.

నేడు జిల్లాకు నేషనల్ లెవల్ మానిటరింగ్ కమిటీ రాక

- కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై పరిశీలన

గద్వాల, జూలై 3(ఆంధ్రజ్యోతి) జోగుళాంబ గద్వాల జిల్లాలో కేంద్ర గ్రామీణాభివృద్ధి, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పథకాలు, అభివృద్ధి పనులపై పరిశీలన చేసేందుకు ఇద్దరితో కూడిన నేషనల్ లెవల్ మానిటరింగ్ టీమ్ శుక్రవారం గద్వాలకు రానుంది. కలెక్టరేట్‌లోఅధికారులతో సమావేశం అయిన తర్వాత జిల్లాలోని 13మండలాల్లో నిర్వహించిన ఉపాధిహామీ పథకం అమలు తీరు, నిర్మల్‌భారత్, పీఎంఏవై, ఎన్‌ఎస్‌ఏపీ, పీఎంజీఎస్‌వై, పీఎంకేఎస్‌వై వంటి పథకాల అమలు తీరును పరిశీలన చేయనున్నారు. శుక్రవారం నుంచి 13వ తేదీ వరకు జిల్లాలోని గ్రామాల్లో వారు క్షేత్రస్థాయి పరిశీలన చేసి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖకు నివేదిక సమర్పించనున్నారు. ఈ మేరకు కలెక్టర్ కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలు చేసే శాఖల అధికారులతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు.

నేడు ఫుట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు

గద్వాల అర్బన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఫుట్‌బాల్ స్టేడియంలో ఈ నెల 4వ తేదీ శుక్రవారం బాలికల జూనియర్ ఫుట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు గద్వాల ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు బండల వెంకట్రాములు, సెక్రటరీ విజయ్, ట్రెజరర్ త్యాగరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున ఎంపిక పోటీలకు హాజరయ్యే బాలబాలికలు ఆధార్‌కార్డు, బర్త్ సర్టిఫికెట్, ఒక ఫొటో తీసుకుని హాజరు కావాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలి

● కలెక్టర్ బీఎం సంతోష్

● విద్యాశాఖ అధికారులతో సమావేశం

గద్వాలన్యూటౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యా సంవత్సరంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగేలా కృషి చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ విద్యాశాఖ అధికారులకు సూచించారు. గురువారం ఐడీవోసీ కాన్ఫరెన్స్ హాలులో విద్యాశాఖ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగుపడిన మౌళిక సదుపాయాలు, ఉత్తీర్ణత, కొత్తగా భర్తీ అయిన ఉపాధ్యాయుల ఖాళీలు, నాణ్యమైన విద్యాబోధన, ఉచిత యూనిఫామ్‌లు, పాఠ్యపుస్తకాలను రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తున్న విషయాలపై ఇంటింటికి వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో అధిక సంఖ్యలో చేర్పించేందుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు 100 శాతం హాజరు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఇంటర్మీడియట్ అధికారి హృదయరాజు, అన్ని మండలాల విద్యాధికారులు, జిల్లా కోఆర్డినేటర్లు, ఉన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో

సాధారణ కాన్పులు జరిగేలా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్దప్ప

● డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్దప్ప

గద్వాల న్యూటౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పీహెచ్‌సీ, ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ కాన్పులు జరిగేలా వైద్యసిబ్బంది చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్దప్ప అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో ప్రోగ్రాం అధికారులు, ప్రాథమిక ఆరోగ్యసిబ్బందితో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో కాన్పులు జరిగితే వైద్యసిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి గర్భిణీ ఇంటికి వెళ్లి ఏఎన్‌ఎం, ఆశ సూపర్‌వైజర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు డెలవరీలకు రావాలని అవగాహన కల్పించాలన్నారు. అలాగే డిజాజ్టర్ మేనేజ్మెంట్ జిల్లాలో టీం ఉంటుందని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో రాపిడ్ రెస్పాన్స్‌టీం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రామాలలో అప్రమత్తంగా ఉండి గర్భిణీల విషయం మెడికల్ అధికారులకు సూచించాలన్నారు. గర్భిణీలకు ప్రభుత్వ ఆసుపత్రిలలో ప్రసవం సులభతరం, సురక్షితంగా ఉంటుందనే విషయాలపై అవగాహన కల్పించాలన్నారు ఈ సమావేశంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్లు రాజు, ప్రసూనారాణి, డీపిహెచ్ఎన్ వరలక్ష్మి, డీఎస్ఓ తిరుమలేష్‌రెడ్డి, ఎన్సీడీ సమన్వయ కర్త శ్యాంసుందర్, డీడీఎం రామాంజనేయులు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల సూపర్‌వైజర్లు, అర్బన్‌హెల్త్ సెంటర్ సిబ్బంది ఉన్నారు.

భారత్‌మాల రహదారిపై రైతుల ధర్నా

అయిజ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): భారత్‌మాల రహదారిపై రైతులు ధర్నా కార్యక్రమము నిర్వహించారు. గురువారం అయిజ మండల పరిధిలోని దేవబండ గ్రామానికి చెందిన రైతులు భారత్‌మాల రహదారిపై అడ్డంగా టెంట్ వేసి బైఠాయించారు. రహదారి నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన రైతులకు 3వ విడత నష్ట పరిహారంతో పాటు పొలంలో వేసిన పైపులు, చెట్లు వ్యవసాయ సంబంధిత వాటికి ఇప్పటి వరకు నష్ట పరిహారం చెల్లించలేదని రైతులు వాపోయారు. ఈ విషయమై పలుమార్లు ధర్నాలు చేశామని, అధికారులు, కాంట్రాక్టర్లు సర్దిచెబుతున్నారే కాని పనులు చేయటం లేదన్నారు. నష్ట పరిహారం అందే వరకు దీక్ష చేస్తామంటు రైతులు ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమములో రైతులు జయన్న, వెంకటేష్, నర్సింహులు, వెంకటస్వామి, రంగస్వామి, రాముడు ధర్నాలో పాల్గొన్నారు.

అనుమతుల్లేకుండా విద్యుత్ లైన్ పనులు

» నిలిపివేయించిన ఇన్‌చార్జి అధికారి రమేశ్‌చంద్ర



ఆసుపత్రి ప్రహరీ వెంట విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్న కాంట్రాక్టర్

అలంపూరుచౌరస్తా, జూలై 3 (ఆంధ్రజ్యోతి): వంద పడకల ఆసుపత్రి వద్ద అనుమతిలేకుండా చేపట్టిన విద్యుత్ లైన్ ఏర్పాటు పనులను ఆసుపత్రి ఉన్నతాధికారులు నిలిపివేయించారు. అలంపూర చౌరస్తాలో నిర్మించిన ప్రధాన ఆసుపత్రి ముందు గేటు వెంట ఆసుపత్రి అధికారులకు సమాచారం ఇవ్వకుండానే ఓ కాంట్రాక్టర్ విద్యుత్‌లైన్ ఏర్పాటు పనులు చేపట్టారు. విషయం తెలియడంతో ఇన్‌చార్జి అధికారి డా. రమేష్‌చంద్ర పనులను నిలిపివేయించారు.

మునిసిపాలిటీలో అభివృద్ధి ఏదీ?

» బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి



భరత్‌నగర్ కాలనీలో మురుగు గుంతను చూపుతున్న బీజేపీ నాయకులు

అయిజ టౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): అయిజ మునిసిపాలిటీలో అభివృద్ధి ఎక్కడ జరిగిందని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ప్రశ్నించారు. గురువారం అయిజలోని భరత్‌నగర్ ఏరియాలో పార్టీ నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. కాలనీలోని భగవంతు, వెంకటేష్, తిమ్మప్ప ఇళ్లకు సమీపంలో కొన్నేళ్లుగా మురుగుతో నిండిన పెద్ద గుంత ఉన్నప్పటికీ స్థానిక అధికారులు శుభ్రం చేయించలేదన్నారు. ఏడాది పొడవునా పట్టించుకునే నాథుడే లేకపోవటం బాధాకరమన్నారు. భరించలేని దుర్వాసన వెదజల్లుతున్నా మునిసిపాలిటీ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. మురుగు వల్ల ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని, దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యం వీడి మురుగు గుంతను శుభ్రం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి, వీరేష్‌గౌడు, భగవంతు, రఘు, నర్సింహ, వెంకటేష్, గోపాల్ రెడ్డి, తిమ్మప్ప పాల్గొన్నారు.

కంది విత్తనాల కిట్లు అందజేత



రైతులకు మినీ కంది విత్తనాల కిట్లను పంపిణీ చేస్తున్న సింగిల్ విండో చైర్మన్ మోహన్ రెడ్డి

అలంపూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): కంది పంట సాగుకు రైతులను ప్రోత్స హించేందుకు పూర్తి రాయితీతో కేంద్ర ప్రభుత్వం కంది విత్తనాల మినీ కిట్స్‌ను అందిస్తున్నదని వ్యవసాయ విస్తరణ అధికారి నాగార్జునరెడ్డి అన్నారు. స్థానిక పీఏసీఎస్ భవనం వద్ద బుధవారం జాతీయ ఆహార భద్రత పథకం ద్వారా కంది విత్తనాల కిట్లను సింగిల్ విండో చైర్మన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులకు పంపిణీ చేశారు. ఎల్‌ఆర్‌జీ- 52, 105, పీఆర్‌జీ-176 రకాలు మొత్తం 555 అందాయని తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండోవైస్‌చైర్మన్ మద్దిలేటి పాల్గొన్నారు.

బంగారు షాపులో చోరీ

వడ్డేపల్లి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): శాంతినగర్‌లో గురువారం శ్రీనివాస జ్యూవెలర్స్‌లో రూ.4 లక్షలు, రెండు కేజీల వెండిని గుర్తుతెలియని వ్యక్తి అపహరించినట్లు బాధితుడు శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఉదయం 10.30 గంటలకు షాపు తెరచి క్యాష్ బ్యాగును టేబుల్ మీద పెట్టగా అక్కడే కాపు కాచుకున్న గుర్తుతెలియని వ్యక్తి బ్యాగును తీసుకుని కర్నూల్ వైపు మోటార్‌సైకిల్‌పై వెళ్లినట్లు శాంతినగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు శ్రీనివాసులు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

ఇటిక్యాల, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉదండాపురం శివారులో గురువారం సాయంత్రం పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఇటిక్యాల ఎస్సై వెంకటేష్ తెలిపారు. ఆరుగురిని అదుపులోకి తీసుకున్నామని, రూ.29,850 నగదు, మూడు బైక్‌లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

'రైతులను మోసం చేసే ఉద్దేశం లేదు'

మల్దకల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : సీడ్ పత్తి సాగుచేసే రైతులను మోసంచేసే ఉద్దేశం తమకు లేదని సీడ్ పత్తి ఆర్గనైజర్, సింగిల్‌విండో చైర్మన్ తిమ్మారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో సింగిల్‌విండో కార్యాలయంలో సీడ్ పత్తి రైతులతో సమావేశం నిర్వహించారు. తాము రైతులకు సీడ్ పత్తి మొక్కలు తొలగించాలని చెప్పలేదన్నారు. ఎకరాకు రెండు క్వింటాళ్లు మాత్రమే తీసుకుంటామని ఎవరికీ చెప్పలేదన్నారు. ఫెయిల్ అయిన రైతులతో 80నుంచి 89 శాతం జీవోటీ వచ్చినా ఫెయిల్ అయితే రైతులు రీజీవోటీ పెట్టి మళ్లీ ఒకసారి కంపెనీ ద్వారా మాట్లాడి రైతులకు న్యాయం చేయాల్సింగా తాము కోరామని చెప్పారు. అనంతరం మాట్లాడిన రైతులు సీడ్ పత్తి సాగు వల్లే ఆర్థికంగా తమ కుటుంబాలు బాగుపడ్డాయన్నారు. సమావేశంలో రైతులు గజ్జలన్న, ఉప్పరి నాగరాజు, బుర్ర నరసింహులు, తిమ్మప్ప, లక్ష్మన్న, రాముడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో

దంపతులకు తీవ్ర గాయాలు

గట్టు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాయపురం దగ్గర నిర్మాణం అవుతున్న ఆరు లైన్ల రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. చిన్నారి క్షేమంగా బయటపడింది. అయిజ మండలం ఉప్పల గ్రామానికి చెందిన వీరేష్, సుజాత కర్ణాటకలోని దొంగరాంపురం గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా, రాయపురం గ్రామ సమీపంలో వారు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి పక్కన ఉన్న ఇనుప గార్డుకు తగిలింది. దీంతో భార్యాభర్తలు కింద పడ్డారు. తీవ్రగాయాలు కావడంతో వారిని భారత్‌మాలకు చెందిన సిబ్బంది ప్రైవేటు వాహనంలో గట్టు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం 108 అంబులెన్స్‌లో గద్వాల జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు తెలిసింది.